ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 30.0 కనిష్ఠం : 18.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5


అనంతపురం
జిల్లా వార్తలు
మంగళవారం 18 నవంబరు 2025



మొదటిరోడ్డు కాశీ విశ్వేశ్వరాలయంలో అలంకరణలో స్వామివారు



కార్తీక వెలుగులు

ఘనంగా కార్తీక సోమవారం

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

దీపాలు వెలిగించి.. పూజలు



మొదటి రోడ్డు కాశీ విశ్వేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అనంతపురం టౌన్/తాడిపత్రి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక చివరి సోమవార పూజలు జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని శివాలయాలు, పరమేశ్వరుడి సమేత అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్దఎత్తున శివాలయాలకు చేరుకుని, దీపాలు వెలిగించి పరమేశ్వరునికి హారతులు పట్టారు. జిల్లా కేంద్రంలోని మొదటిరోడ్డులో గల కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో స్వామికి శయనోత్సవం చేశారు. శివకోటి ఆలయంలో శివకామేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. చెరువుకట్ట సమీపంలోని కాశీవిశ్వేశ్వరాలయంలో స్వామివారికి అఘోరా అలంకారం గావించి పూజలు నిర్వహించారు. కోనేరులో గంగా హారతులు సమర్పించారు. అన్నివయసుల భక్తులు జ్యోతులు వెలిగించారు.



మహంకాళేశ్వరుడిగా బుగ్గ రామలింగేశ్వరుడు

తాడిపత్రిలోని శ్రీ బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక చివరి సోమవారం కావడంతో స్వామివారు ఉజ్జయిని మహంకాళేశ్వర స్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. 11116 దీపాలను వెలిగించారు.





చెరువుకట్ట వద్ద కాశీవిశ్వేశ్వరాలయంలో అఘోరీ అలంకారంలో దర్శనమిస్తున్న స్వామివారు

పెట్టుబడులు.. బాబు ఘనతే

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



రాయదుర్గం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నిరంతర శ్రమ, కృషితో రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే అభివృద్ధి పట్టాలెక్కుతోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సూపర్‌సిక్స్ పథకాలను ఏడాదిన్నరలోనే అమలు చేశామన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ చేస్తున్న మంచిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ రెండో విడతలో రాయదుర్గం నియోజకవర్గంలో 38,508 మంది రైతులకు రూ. 26.95 కోట్లు రైతుల ఖాతాల్లో ఈ నెల 19న జమ చేస్తామన్నారు. ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా చేదోడు వాదోడుగా ఉంటుందన్నారు.

ఎమ్మెల్యే బాలకృష్ణపై వైసీపీ నేతలు విమర్శలు మానాలి

ఉమ్మడి జిల్లాలో హిందూపురం నియోజకవర్గం టీడీపీకి పెట్టని కోట అన్నారు. దివంగత ఎన్‌టీఆర్ 1985 నుంచి మూడుసార్లు నియోజకవర్గం నుంచి గెలుపొందిన విషయాన్ని గుర్తు చేశారు. వరుసగా ఆయన తనయులు అనంతరం గెలుస్తూ వస్తున్నారన్నారు. ఎన్‌టీఆర్ కుటుంబసభ్యుల ఏలుబడిలో హిందూపురం దినదినాభివృద్ధి జరుగుతోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎమ్మెల్యే బాలకృష్ణపై వైసీపీ నేతలు అవాకులు, చవాకులు పేలడం సిగ్గుచేటన్నారు. వైసీపీ నేతలు పని గట్టుకుని చేసే విమర్శలు పార్టీ, బాలకృష్ణ అభిమానులు సహించరని గుర్తు చేశారు.

పంచాయితీ చేస్తాం..

దంపతులను కలుపుతామంటూ కుల పెద్దల డిమాండ్

రూ.10లక్షలు ఇవ్వండి..

ఒప్పుకోకపోవడంతో వేధింపులు

కలెక్టర్‌కు విన్నవించుకున్న బాధితురాలు

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య సమస్య పరిష్కరించడానికి కులపెద్దలు పంచాయితీ చేస్తారట. అందుకు ఏకంగా రూ.10లక్షలు, పది తులాల బంగారం ఇవ్వాలని తీర్మాణం చేశారు. ఈ ఘటన గుంతకల్లులో వెలుగుచూసింది. బాధితురాలు తన సమస్యను చెప్పుకోవడానికి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చింది. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారుల దృష్టికి తీసుకొచ్చింది. గుంతకల్లుకు చెందిన మోతి కుళ్లాయమ్మ మీడియాకు సమస్య వివరించింది. గుంతకల్లు పట్టణంలోని కథలవీధికి చెందిన కుళ్లాయమ్మకు అదే కాలనీకి చెందిన మోతి రమేష్‌తో 17 ఏళ్ల క్రితం వివాహమైంది. నలుగురు పిల్లలున్నారు. రమేష్ కొంత కాలంగా వ్యసనాలకు బానిసై తనను వదిలించుకోవాలని చూస్తున్నాడని కుళ్లాయమ్మ ఆరోపించింది. ఈ విషయంలో బుక్కరాయసముద్రానికి చెందిన పూజారి కుళ్లాయప్ప.. రమేష్‌కు మద్దతిచ్చాడు. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ చేస్తామని చెప్పాడు. అందుకు రూ.2లక్షల డబ్బు, 10తులాల బంగారం ఇవ్వాలని చెప్పారు. అందుకు కుళ్లాయమ్మ ఒప్పుకోలేదు. దీంతో ఆమెను వదిలేసి భర్త రమేష్.. పిల్లలను తీసుకుని వెళ్లిపోయాడు. సమస్యను పెద్ద మనుషులు పెద్దపుల్లన్న, మోతి ఆంజనేయులు, సంకుల ఆంజనేయులు, గడ్డం రామలింగ, డొక్కా వీరన్నకు కుళ్లాయమ్మ చెప్పుకుంది. దీంతో దంపతులను కలపడానికి పంచాయితీ చేస్తామనీ, అందుకు రూ.10లక్షలు, పది తులాల బంగారం ఇవ్వాలని పెద్దమనుషులు చెప్పారని తెలిపింది. డబ్బు ఎందుకివ్వాలని ప్రశ్నించినందుకు తమను కులం నుంచి వెలివేస్తున్నామని చెప్పారని బాధితురాలు వాపోయింది. తనను ఇల్లు ఖాళీ చేసి, తండ్రి వద్ద ఉండేలా తీర్మానం చేశారన్నారు. కుల పెద్దలతోపాటు భర్త రమేష్, పూజారి కుళ్లాయప్పపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు కోరింది.

రైతులను ఆదుకోవాలి

అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని వైసీపీ నాయకులు అధికారులను కోరారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గౌస్‌బేగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతీనాయుడు, మైనార్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, ఎస్సీ విభాగ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసనాయక్ తదితరులు.. అధికారులకు వినతిపత్రం అందజేశారు. పుట్లూరు, యల్లనూరు, తాడిపత్రి, పెద్దవడుగూరు తదితర మండలాల్లో గత మార్చి, ఏప్రిల్ నెలల్లో తుపాన్, గాలివానకు అరటి, మొక్కజొన్న, దానిమ్మ తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. దీంతో రైతులు నష్టపోయి, అప్పులపాలయ్యారన్నారు. అప్పటి కలెక్టర్ మొత్తం రూ.47.47కోట్లు నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదికలు పంపారన్నారు. ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్



లేజర్ షోలో సత్యసాయి బాబా

సంబరాల సందడి..!

- పుట్టపర్తికి వేలాదిగా వస్తున్న భక్తులు
- నేడు సత్యసాయి రథోత్సవం
- నేడు గవర్నర్, డిప్యూటీ సీఎం, లోకేశ్ రాక
- రేపు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు రాక
- 22, 23 తేదీల్లో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటన
- భద్రతా వలయంలో పుట్టపర్తి.. పరిసర ప్రాంతాలు



సత్యసాయి మహా సమాధి వద్ద భక్తులు

పుట్టపర్తి, టౌన్, రూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి వేడుకలకు వచ్చే భక్తులతో పుట్టపర్తి అలరారుతోంది. మహాసమాధిని వేలాది మంది దర్శించుకుంటున్నారు. సాయికుల్వంతు సభా మంటపంలో సోమవారం పండిట్ విశ్వనాథ్ మోహన్ భట్ బృందం వీణావాయిద్యం భక్తులను అలరించింది. చిత్రావతి నదిలో లేజర్ షో ఆకట్టుకుంటోంది. ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి లేజర్ షోను వీక్షించారు. చిత్రావతినది తీరం భక్తులతో కిటకిటలాడింది. మరోవైపు మంగళవారం నిర్వహించే సత్యసాయి రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా 30 అడుగుల ఎత్తైన వెండిరథాన్ని సిద్ధంచేశారు. రథోత్సవం తిలకించడానికి వేలాది మంది భక్తులు ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు.

రేపు ప్రధాని.. 22న రాష్ట్రపతి రాక

శత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు బుధవారం పుట్టపర్తికి వస్తున్నారు. ప్రధాని బుధవారం ఉదయం సత్యసాయి మహాసమాధిని దర్శించుకుని, హిల్ వ్యూ స్టేడియంలో జరిగే ఉత్సవాల్లో పాల్గొంటారు. ప్రధాని పర్యటనకు భద్రతను పటిష్ఠం చేశారు. సత్యసాయి విమానాశ్రయం నుంచి ప్రశాంతి నిలయం, హిల్‌వ్యూ స్టేడియం దాకా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 22న రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, సీఎం, పలురాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు వస్తున్నారు. వీరి కోసం విమానాశ్రయంతోపాటు నాలుగుచోట్ల హెలీప్యాడ్‌లు ఏర్పాటు చేశారు. కాన్వాయ్ వెళ్లే మార్గంలో గట్టి భద్రత ఏర్పాటు చేశారు. భక్తుల కోసం హిల్ వ్యూ స్టేడియం సభావేదికకు ఇరువైపులా ఎల్ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేస్తున్నారు.

అదనపు డీజీ సమీక్ష

జాతీయ స్థాయి వీవీఐపీల పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఏపీ లా అండ్ ఆర్డర్ అదనపు డీజీ మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. ఈ నెల 19న ప్రధాని, 22, 23న రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి సహా పలువురు వీవీఐపీలు, వీఐపీలు పుట్టపర్తికి వస్తున్నారు. దీంతో డీపీఓ సమీపంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఐజీ శ్రీకాంత్, డీఐజీలు షిమోషి, ఫక్కీరప్ప, అన్బురాజన్, సత్యయేసు బాబు, ఎస్పీలు సతీష్‌కుమార్, జగదీష్, పరమేశ్వర్ రెడ్డి, రాధిక, దీపికా పాటిల్, కృష్ణకాంత్ పటేల్, రాణా, సునీల్ ట్రైనీ తదితర ఉన్నతాధికారులతో ఆయన భద్రతపై సమీక్ష నిర్వహించారు. వీవీఐపీల (మిగతా 6లో...)

రమా.. నీవు లేకుండా ఎలా బతికేది..?

- భార్య మృతదేహంపై పడి రోదించిన భర్త
- ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ
- మహిళ మృతి.. ముగ్గురికి గాయాలు

7



మాట్లాడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడుకు బంగారు భవిష్యత్తు

సీఎం చంద్రబాబు

చొరవతోనే

రేమండ్స్ రాక

ఎమ్మెల్యే పరిటాల సునీత

6

తూకాల్లో తేడా..!

తక్కువ తూకంతో రేషన్ షాపులకు బస్తాల సరఫరా

బయటకు చెప్పుకోలేకపోతున్న డీలర్లు

కార్డుదారులపై ప్రభావం

పైసలిస్తేనే సర్వే..!

సెంటుకు రూ.2వేలు, ఎకరాకు రూ.3వేలు.. వివాదాస్పద భూముల్లో రూ.30వేల వరకు..

- పాసుపుస్తకాలకూ వసూళ్లే..
- మండల సర్వేయర్ల బాటలోనే విలేజ్ సర్వేయర్లు

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో సర్వే కోసం తిప్పలు తప్పడం లేదు. పైసలిస్తేనే సర్వే చేస్తున్నారు. లేని పక్షంలో చలానా కట్టినా...ఆ వ్యక్తి ఎవరో తెలియనట్లే సర్వేయర్లు వ్యవహరిస్తున్నారు. రైతుల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వరకు ముడుపులు అందిస్తేనే సర్వే చేసే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో పలువురు సర్వేయర్ల అవినీతి తారస్థాయికి చేరింది. కొలతల కోసం వచ్చే రైతులను ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. సర్వే రిపోర్టు త్వరగా అందాలంటే పైసలివ్వాల్సిందే. లేదంటే రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాలి. వేల సంఖ్యలో భూ సమస్యలు ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉన్నాయి. వీటిలో సగానికి పైగా సర్వే అంశం చుట్టూనే తిరుగుతున్నాయి. మండల సర్వేయర్లతో పాటు సచివాలయ వ్యవస్థ ద్వారా వచ్చిన విలేజ్ సర్వేయర్లు సైతం మామూళ్లకు అలవాటు పడ్డారు.



సర్వే చేస్తున్న దృశ్యం (ఫైల్)

ముడుపులిస్తేనే కదలిక..

ఎక్కడ సర్వే చేయించాలనుకున్నా ముడుపులు ముట్టజెప్పాల్సిందే. ప్లాట్లకు సంబంధించి సెంటుకు రూ.2వేలు, పొలాలకయితే ఎకరాకు రూ.3వేలు ఇవ్వాల్సిందే. తాజాగా అనంతపురం నగర సమీపంలోని ఓ గ్రామంలో ఐదు ఎకరాలలో సర్వే చేయడానికి ఓ రైతు నుంచి రూ.15వేలు తీసుకున్నారు. నిబంధనల మేరకు చలానాలు కట్టినా ముడుపులు చెల్లించాల్సిందే. మండలంలో మండల సర్వేయరే కీలకం. సచివాలయాల వారిగా విలేజ్ సర్వేయర్లు పనిచేస్తున్నారు. సర్వే మాత్రమే కావాలంటే ప్రైవేట్ సర్వేయర్లు రూ.500 లేదా రూ.1000కు చేస్తారు. రిపోర్టులో మండల సర్వేయర్ సంతకం కావాలంటే ఎక్కువ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. వివాదాస్పద భూములయితే ఎకరాకు రూ.10వేల నుంచి రూ.30వేల వరకు వసూలు చేస్తారని సమాచారం. అదే రీతిలో కమర్షియల్ భూములు(విలువైన భూములు) సర్వేకు సంబంధించి మరో లెక్క ఉంటుంది.

రీసర్వేతో తిప్పలు

వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేపై అనేక ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నరవుతున్నా ఇంకా ఆ భూముల సమస్యలు పరిష్కారం కాలేదు. రైతులను సంప్రదించకుండానే వాటిని జాయింట్ ఎల్‌పీఎం కింద నమోదు చేసి తిరకాసు చేశారనే విమర్శలు ఉన్నాయి. ఇంకా చాలా గ్రామాల్లో రీసర్వే పూర్తయినా పాసుపుస్తకాలు మంజూరు కాలేదు. మూడో దశ సర్వే ప్రారంభమైనా ఇంకా ఒక్కో మండలంలో కనీసం ఆరు గ్రామాలు కూడా పూర్తి కాలేని పరిస్థితి. చాలా మండలాల్లో సరిహద్దు వివాదాలు, ఇతర విషయాల్లో భారీగా డబ్బు వసూలు చేస్తున్నారని సమాచారం.



పామిడి తహసీల్దార్ కార్యాలయంలో విలేజ్ సర్వేయర్లు

సబ్ డివిజన్‌కు.. పాసుపుస్తకాలకూ ఓ రేటు

కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. రెవెన్యూ శాఖపై అనేక ఫిర్యాదులు అందాయి. సబ్ డివిజన్ చేయాలంటే సర్వేయర్లే కీలకం. సబ్ డివిజన్ చేయాలంటే ఆమ్యామ్యాలు అందాల్సిందే. రెవెన్యూ అధికారులు, సర్వేయర్లకు పంపకాలు ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని చోట్ల పాసుపుస్తకాలు ఇవ్వలేని భూములకు సైతం ఇప్పిస్తామంటూ రూ.వేలకు వేలు వసూలు చేస్తున్నారని సమాచారం. ఇంత దందా జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి.

పర్యవేక్షణ ఏదీ..?

రెవెన్యూ, సర్వే విభాగాల్లో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరువయిందనే విమర్శలు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయాల పనితీరుపై జిల్లా స్థాయిలో సమీక్షలు జరగడం లేదు. కలెక్టర్ లేదా డీఆర్వో స్థాయిలో తరచూ పర్యవేక్షణ ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి. సిబ్బంది పనితీరుపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనో, ఇతరత్రా ఫిర్యాదులందితే తప్ప అధికారులకు అసలు విషయాలు తెలియడం లేదు. ఇక సర్వే విభాగంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇది వరకు అసిస్టెంట్ డైరెక్టర్ పర్యవేక్షించేవారు. నాలుగు నెలల నుంచి డిప్యూటీ డైరెక్టరు ఉన్నా పర్యవేక్షణ నామ మాత్రంగానే ఉంది. విలేజ్ సర్వేయర్లు క్షేత్రస్థాయిలో సరిగ్గా వెళ్లడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఒకటి రెండు భూములు తిరిగొచ్చి మధ్యాహ్నం నుంచి కార్యాలయంలోనే తిష్ఠ వేస్తుంటారనే ఫిర్యాదులు అధికమయ్యాయి.

రేపు రైతుల ఖాతాల్లోకి సొమ్ము

అన్నదాత సుఖీభవ,

పీఎం కిసాన్ సొమ్ము విడుదల

7

పుట్టిన రోజునే ఆత్మహత్య

- అపార్ట్‌మెంట్ పైనుంచి దూకిన బీటెక్ విద్యార్థి
- అక్కడికక్కడే మృతి

సంబరాల సందడి..!


సత్యసాయిబాబా లేజర్ షో


తిలకిస్తున్న భక్తులు

(5వ పేజీ తరువాయి)
షెడ్యూల్, మినిట్ టు మినిట్ రూట్ మ్యాప్, భద్రత గురించి డీఐజీ షిమోషి, ఎస్పీ వివరించారు. వేడుకలు, ప్రముఖుల పర్యటనలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని అదనపు డీజీ ఆదేశించారు. స్టేడియం, సాయి కుల్వంతు హాలు వెలుపల ప్రతి ఒక్కరినీ తనిఖీ చేయాలని ఆదేశించారు. భక్తులతో మర్యాదగా నడుచుకోవాలని, సూచించారు. ఏ చిన్న సమస్య వచ్చినా కంట్రోల్ రూంకు సమాచారం అందచేయాలని సూచించారు.

నేడు డీఎంఈ రాక

అనంతపురం వైద్యం(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జయంతి వేడుకలను పురస్కరించుకుని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ రఘునందన్ మంగళవారం పుట్టపర్తి రానున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ఇతర ప్రముఖులు బుధవారం సత్యసాయి జయంతి వేడుకలకు రానున్న తరుణంలో ప్రత్యేక అత్యవసర వైద్యసేవల కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ వైద్య విద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఫోరెన్సిక్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ ఆర్.శంకర్ లైజనింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. ఇప్పటికే కళాశాల నుంచి వివిధ విభాగాల స్పెషల్ డాక్టర్లకు డ్యూటీలు కేటాయించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం నుంచి 23వరకు ప్రత్యేక అత్యవసర కేంద్ర సేవలు కొనసాగనున్నాయి. కాగా డీఎంఈ రఘునందన్‌తోపాటు అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వర్లు, స్టేట్ నోడల్ ఆఫీసర్ అనురాధ తదితరులు వేడుకలకు రానున్నట్లు లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ శంకర్ పేర్కొన్నారు.

వేడుకలు విశ్వవ్యాప్తం: రత్నాకర్


మాట్లాడుతున్న ఆర్‌జే రత్నాకర్

సత్యసాయి శత జయంతి వేడుకలకు దేశ విదేశాల నుంచి తరలివచ్చిన భక్తులతో పుట్టపర్తిలో కోలాహలం నెలకొందని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ అన్నారు. సత్యసాయి ప్రేమ, సందేశాలు విశ్వ వ్యాప్తంగా ప్రతిధ్వనిస్తున్నాయని అన్నారు. ప్రశాంతి నిలయం రేడియో సాయి వద్ద అఖిలభారత సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు నిమీష్ పాండేతో కలిసి సోమవారం మీడియాతో మాట్లాడారు. వేడుకలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారం, ఏర్పాట్ల గురించి వివరించారు. సెంట్రల్ ట్రస్ట్, సేవాసంస్థలు, సిబ్బంది, సాయి విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, కార్యకర్తల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. శత జయంతి ఉత్సవాలకు ఏడాది కాలంగా రూపకల్పన చేశామని, దేశవిదేశీ భక్తులు 220కిపైగా సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు వసతి, భోజనం, దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. రైల్వే స్టేషన్ నుంచి ప్రశాంతి నిలయం వరకూ దారులన్నీ విద్యుత్ కాంతులు పరుచుకున్నాయని తెలిపారు. సాయి భక్తులు స్వచ్ఛందంగా ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు.


సీఎం చంద్రబాబు చొరవ..



రాష్ట్ర ప్రభుత్వం సత్యసాయి శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రభుత్వం, ట్రస్టు కలిసి ఘనంగా వేడుకలు జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ చూపించారని, అధికార యంత్రాంగాన్ని దించి పని చేయిస్తున్నారని అన్నారు. కేంద్రం ప్రభుత్వం 160 ప్రత్యేక రైళ్లు వేసిందని అన్నారు. ఈ నెల 19న ప్రధాని చేతుల మీదుగా సత్యసాయి శత జయంతి స్మారక చిహ్నంగా వంద రూపాయల నాణెం, నాలుగు తపాల స్టాంపులను ఆవిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాల్లో జిల్లాలో వంద మంది రైతులకు పాడి ఆవులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఏటా 18న జరిగే వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని సత్యసాయి రథోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సత్యసాయి శత జయంతి వేడుకలు భక్తులకే కాదని, సమస్త సృష్టి కోసం, మనుషులు, జంతువులు, ప్రకృతి, చెట్లు, పక్షులు అన్నింటికీ పరమ పవిత్రమైన పండుగ అని నిమీష్ పాండే అన్నారు.

నేడు పుట్టపర్తికి గవర్నర్

● ఉత్సవాల్లో పాల్గొననున్న డీసీఎం, మంత్రి లోకేశ్



పుట్టపర్తి(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాలోకేశ్ మంగళవారం పుట్టపర్తికి రానున్నారు. గవర్నర్ అబుల్ నజీర్ విజయవాడలో సాయంత్రం నాలుగు గంటలకు ప్రత్యేక విమానంలో బయల్దేరి 5.20 గంటలకు సత్యసాయి విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రికి శ్రీనివాస అతిథి గృహంలో బస చేస్తారు. బుధవారం ఉదయం 9.45కి ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి సత్యసాయి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతారు. అనంతరం సాయికుల్వంత్ హాలులో సత్యసాయి మహా సమాధిని దర్శించుకుంటారు. తర్వాత 10.30 హిల్‌వ్యూ స్టేడియంలో ప్రధానితోపాటు సత్యసాయి శత జయంతి వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం తిరుపతికి వెళ్తారు. డిప్యూటీ సీఎం సాయంత్రం 4 గంటలకు విజయవాడలో ప్రత్యేక విమానంలో బయలుదేరి సాయంత్రం 5 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రికి ప్రశాంతి నిలయంలోని శ్రీనివాస అతిథి గృహంలో విడిది చేస్తారు. ఐటీ శాఖ మంత్రి నారాలోకేశ్ మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో 3.40గంటలకు ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయల్దేరి పుట్టపర్తి విమానాశ్రయానికి 5.10కి చేరుకుంటారు. పుట్టపర్తిలో కప్పలబండ ఏపీఐఐసీ పార్కులో ఏర్పాటు చేసిన ప్రత్యేక విడిది కేంద్రంలో బసచేస్తారు. బుధవారం పుట్టపర్తి విమానాశ్రానికి చేరుకుంటారు. ప్రధాన మంత్రిని స్వాగతం పలుకుతారు. పది గంటలకు సాయికుల్వంత్ హాలోలో సత్యసాయిబాబా మహాసమాధిని దర్శించుకుంటారు. 10.30 హిల్‌వ్యూ స్టేడియంలో నిర్వహించే సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1 గంటకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుని వెళ్తారు. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణ మధ్యాహ్నం 12.45కి బెంగళూరు విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో పుట్టపర్తి చేరుకుని రాత్రికి పుట్టపర్తిలో బసచేస్తారు.

చలికి చెల్లు

సంక్షేమ హాస్టళ్లకు దుప్పట్లు, కార్పెట్ల సరఫరా

విద్యార్థుల ఆనందం


అనంతపురంలోని ఎస్సీ-2 బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ రామునాయక్

అనంతపురం విద్య, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చలి విపరీతంగా ఉంటోంది. రాత్రిళ్లు మంచు కురుస్తోంది. దీంతో జనం విలవిల్లాడుతున్నారు. ఇక, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. చలికి అల్లాడిపోతుంటారు. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం.. వారికి దుప్పట్లు, కార్పెట్లు సరఫరా చేసి, ఆదుకుంది. దీంతో విద్యార్థులు ఆనందపడుతున్నారు.

చకచకా పంపిణీ

గత వైసీపీ హయాంలో హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం పేదపిల్లలు చదువుతున్న హాస్టళ్లకు అత్యంత ప్రాధాన్యమిస్తోంది. వైసీపీ హయాంలో చిన్న మరమ్మతులకు కూడా పైసా ఇచ్చేవారు కాదు. నెలనెలా మెస్‌బిల్లులు చెల్లించేవారుకాదు. ప్రస్తుతం హాస్టళ్ల మరమ్మతులకు ప్రత్యేకంగా రూ.లక్ష వరకు నిధులిచ్చారు. మెస్‌బిల్లులు పెండింగ్‌లేకుండా చెల్లిస్తున్నారు. ఈనేపథ్యంలో కొత్త దుప్పట్లు, కార్పెట్లను హాస్టళ్లకు సరఫరా చేశారు. జిల్లాకు వచ్చిన వాటిని హాస్టళ్లకు పంపారు. బీసీ హాస్టళ్లలో 5,400 మందికి, ఎస్సీ హాస్టళ్లలోని 5,267 మందికి, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని 600 మందికి, మైనార్టీ హాస్టళ్లలోని 425 మందికి దుప్పట్లు, కార్పెట్లు వచ్చాయి. వీటన్నింటిని ఆయా హాస్టళ్లకు చేర్చడంతో వార్డెన్లు చకాచకా విద్యార్థులకు పంపిణీ చేశారు.

ప్రతి విద్యార్థికి దుప్పటి, కార్పెట్ ఇచ్చాం



హాస్టళ్ల విద్యార్థులకు కొత్త దుప్పట్లు, కార్పెట్లను ప్రభుత్వం సరఫరా చేసింది. అవి జిల్లాకు రాగానే హాస్టళ్లకు సరఫరా చేయించాం. అక్కడ వార్డెన్లు.. విద్యార్థులకు పంపిణీ చేస్తారు. ప్రతి విద్యార్థికి ఈసారి కొత్త దుప్పటి, కార్పెట్ అందించాం. ఎక్కడా కొరత రాలేదు.

-కుష్బూకొఠారి,
బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల డీడీ

రాప్తాడుకు బంగారు భవిష్యత్తు

సీఎం చంద్రబాబు చొరవతోనే రేమండ్స్ రాక

ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రేమండ్స్ పరిశ్రమ రాకతో రాప్తాడు భవిష్యత్తుకు బంగారు బాటలు పడ్డాయని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. జాకీ పరిశ్రమ స్థానంలో రేమండ్స్ వస్త్ర పరిశ్రమ మంజూరు చేసిన నేపథ్యంలో సోమవారం రాప్తాడు సమీపంలో పరిశ్రమ ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞత సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజనప్ప, ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ థ్యాంకు సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో సీఎం చంద్రబాబు సహకారంతో రాప్తాడులో జాకీ పరిశ్రమ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. వైసీపీ ప్రభుత్వం దాన్ని విస్మరించిందన్నారు. అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, అతడి సోదరుల వసూళ్ల ప్రయత్నం కారణంగా జాకీ రాప్తాడును వదిలిపోయిందన్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి రాగానే అదే కంపెనీ లేక ఇతర కంపెనీలను తీసుకొస్తామని ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశామన్నారు. ఆ మేరకు ప్రముఖ వస్త్ర కంపెనీ రేమండ్స్ రూ.497కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిందన్నారు. పరిశ్రమ ఏర్పాటైతే 4వేల మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



థ్యాంక్యూ సీఎం సర్ పోస్టర్‌కు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్

తూకాల్లో తేడా..!

తక్కువ తూకంతో రేషన్ షాపులకు బస్తాల సరఫరా

బయటకు చెప్పుకోలేక పోతున్న డీలర్లు

కార్డుదారులపై ప్రభావం

అనంతపురంరూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రేషన్ తూకాల్లో కిరి.. కిరి చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి నెలా రేషన్ షాపులకు సరఫరా అయ్యే బస్తాల్లో రెండు నుంచి ఐదు కేజీల వరకు కోత పడుతున్నట్లు తెలుస్తోంది. గోదాముల నుంచే తక్కువ తూకంతో సరఫరా అవుతున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. దీంతో డీలర్లు బయటకు చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రభావం కాస్త కార్డుదారులపై పడుతోంది. కార్డుదారులకు రేషన్ పంపిణీలో కోత పెడుతున్నారు.

తక్కువ తూకంతో సరఫరా..

అనంతపురం రూరల్ మండలం, అర్బన్ పరిధిలో 220కిపైగా రేషన్ షాపులున్నాయి. వాటికి రాప్తాడు సమీపంలోని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ గోదాము నుంచి రేషన్ సరఫరా అవుతోంది. బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాల పరిధిలోని రేషన్ షాపులకు సైతం ఈ గోదాము నుంచి సరఫరా చేస్తున్నారు. ప్రతినెలా గోదాము నుంచి సరఫరా అయ్యే రేషన్ బస్తాల తూకం నానాటికీ తగ్గిపోతోందన్న వాదనలు సంబంధిత వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఒక్కో బస్తాలో 50 కేజీలు ఉండాలి. షాపులకు సరఫరా అవతున్నా బస్తాల్లో మాత్రం భారీస్థాయిలో వ్యత్యాసం ఉంటోంది. ప్రతి నెలా రెండు నుంచి మూడు కేజీల చొప్పున తక్కువ తూకంతో బస్తాలు వస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కోతలు మరింత ఎక్కువైనట్లు సమాచారం. బస్తాలో ఏడెనిమిది కేజీల చొప్పున తక్కువగా వస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. దీంతో డీలర్లు తలలు పట్టుకుంటున్నారు.


నగరంలోని ఓ రేషన్ షాపునకు సరఫరా అయిన బస్తాలో తక్కువగా ఉన్న బియ్యం

కార్డుదారులపై ప్రభావం

రేషన్ తక్కువ తూకాల ప్రభావం కార్డుదారులపై పడుతోంది. రేషన్ షాపుల్లో డీలర్ల కోతలు సర్వసాధారణమైపోయింది. ప్రభుత్వం ఏదైనా డీలర్లు మాత్రం అదే వరఒడిని కొనసాగిస్తున్నారన్నది బహిరంగ రహస్యమే. గతంలో కార్డుదారులు 20కేజీలు తీసుకుంటే రెండు నుంచి మూడు కేజీలు తక్కువగా వచ్చేవి. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి నెలకొంది. గోదాముల నుంచే తక్కువ తూకంతో వస్తుండటంతో కార్డుదారులకు పంపిణీలో కోతలు పెడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు నోరు మెదపట్లేదు. గతంలో డీలర్లు.. గోదాముల వద్దకెళ్లి తూకాలు వేయించుకుని షాపులకు తెచ్చుకునేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గోదాములకు వెళ్లి రేషన్ తెచ్చుకునే డీలర్లు తక్కువైపోయారంటున్నారు. గోదాములో ప్రశ్నించే, ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పేవారికి సక్రమంగా సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. రాగులు, జొన్నల సరఫరాలో ఇలాంటి వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి.



రాప్తాడు సమీపంలోని పౌరసరఫరాల గోదాము

గోదాముల వద్దకెళ్లి తెచ్చుకుంటే సమస్య ఉండదు

బియ్యం బస్తాలు తక్కువ తూకంతో వస్తున్నాయని మా దృష్టికొచ్చింది. కొందరు డీలర్లు బస్తాలను తూకం వేసి, ఫొటోలను వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని గోదాములోని స్టాకిస్టుకు కూడా చెప్పాం. మొదటి నుంచి గోదాము వద్దకు వెళ్లి బస్తాలు తూకం వేసుకుని తెచ్చుకోవాలని డీలర్లకు చెబుతున్నాం. డీలర్లు మాత్రం అక్కడకు వెళ్లడం లేదు. దీంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

-బాషా, సీఎస్‌డీటీ, అనంతపురం అర్బన్, రూరల్ మండలం

ఎస్టీ కమిషన్ సభ్యుడిగా వెంకటప్ప ప్రమాణ స్వీకారం


బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటప్ప

అనంతపురం క్రైం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితుడైన వెంకటప్ప ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం విజయవాడలో ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యుల ప్రమాణస్వీకారం నిర్వహించారు. జిల్లాకు చెందిన వెంకటప్పను ఇటీవల కమిషన్ సభ్యుడిగా ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన.. చైర్మన్ బొజ్జిరెడ్డి, ఇతర సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనను జిల్లాకు చెందిన పలువురు నాయకులు, తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి వెంకటరామయ్య కలిసి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే

ఎస్టీ కమిషన్ సభ్యుడిగా ఎంపికైన వెంకటప్పకు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అభినందనలు తెలిపారు. కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి, ఇతర సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంతపురం జిల్లాకు చెందిన వెంకటప్ప ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాయల్ మురళి, కృష్ణకుమార్, సాకే లక్ష్మీనరసింహ, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

అమ్మ నగలు తాకట్టు పెట్టి..

● 19ఏళ్లకే కిలిమంజారో పర్వతారోహణ

● దిగుమర్రి యువతి కుసుమ ప్రతిభ

నార్పల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏదైనా సాధించాలన్న తపన ఆ యువతిని కిలిమంజారో పర్వత శిఖరాలపైకి తీసుకెళ్లింది. పర్వతంలో రాళ్లు, గుండ్ల కంటే.. జీ వితంలోనే ఎక్కువగా కష్టాలను అధిగమించింది. నిరుపేద కుటుంబంలో పుట్టింది. కూలికెళ్తేనే కుటుంబం గ డుస్తుంది. అయినా.. పేదరికం.. లక్ష్య సాధనకు అడ్డుకాలేదు. అన్న ప్రోత్సహించాడు. అమ్మ బంగారాన్ని తాకట్టుపెట్టి.. ఆశయం దిశగా నడిపించింది. ఆఫ్రికా ఖండంలోనే అత్యంత ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి శభాష్ అనిపించుకుంది మండలంలోని దిగుమర్రి గ్రామానికి చెం దిన కుసుమ. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమే తన లక్ష్యమని చెబుతోంది.

నిరుపేద కుటుంబం

నార్పల మండలంలోని దిగుమర్రి గ్రామానికి చెందిన పెద్దన్న, నారాయణమ్మ దంపతులు కూలి పనులకు వెళ్తుంటారు. వారికి కుమారుడు కుళ్లాయప్ప, కుమార్తె కుసుమ సంతానం. కుళ్లాయప్ప హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. కుమార్తె అన్న వద్దే హైదరాబాద్‌లో ఉంటూ గీతం కాలేజీలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చదువుతోపాటు ఏదో ఒకటి సాధించాలని తపన పెంచుకుంది. కుసుమ లక్ష్యాన్ని తెలుసుకున్న అన్న కుళ్లాయప్ప హైదరాబాద్‌లో బసినేపల్లి శేఖర్ బాబు అకాడమీలో పర్వతారోహణపై రెండేళ్ల పాటు శిక్షణ ఇప్పించాడు. అనంతరం ఆఫ్రికా ఖండంలోని అత్యంత ఎత్తైన పర్వతం కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాలని కుసుమ నిశ్చయించుకుంది. అందుకు దాదాపు రూ.6 లక్షలు ఖర్చవుతుంది. అంత డబ్బు లేకపోవడంతో అమ్మ బంగారాన్ని ప్రైవేటు బ్యాంకులో తాకట్టు పెట్టి కుసుమకు రూ.6 లక్షలు సమకూర్చారు. ఆ డబ్బుతో కిలిమంజారో పర్వతారోహణకు కుసుమ బయల్దేరింది. ఆఫ్రికా ఖండంలోని టాంజానియా దేశంలోని ఈ శిఖరం సముద్ర మట్టానికి 5,895 మీటర్ల ఎత్తులో ఉంటుంది. దీనిని అధిరోహించడం కష్ట సాధ్యమైనదే. అయినా.. కుసుమ ముందడుగే వేసింది. ఈనెల 12వ తేదీన కిలిమంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించింది. అక్కడ త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించింది. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కూడిన ఫ్లెక్సీని ఎగురవేసింది. ప్రస్తుతం హైదరాబాద్‌కు తిరిగొచ్చింది. కాస్త అస్వస్థతగా ఉండడంతో విశ్రాంతి తీసుకుంటున్నట్లు కుటుంబికులు తెలిపారు.



కిలిమంజారో పర్వతంపై కుసుమ

ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఎవరెస్టు అధిరోహిస్తా: కుసుమ

అన్న ప్రోత్సాహం, అమ్మ త్యాగం ఎనలేనివి. వారి కారణంగానే కిలిమంజారోను అధిరోహించాం. ఎవరెస్టు శిఖరం ఎక్కడమే నా లక్ష్యం. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే అధిరోహిస్తా.


తల్లిదండ్రులు, అన్నతో కుసుమ

క్రైం కార్నర్

వైద్యుడి మృతదేహం లభ్యం


కార్తీక్‌రెడ్డి మృతదేహం

బెళుగుప్ప, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద హంద్రీనీవా కాలువలో ఆదివారం సాయంత్రం గల్లంతైన వైద్యుడు కార్తీక్‌రెడ్డి శవమై తేలారు. ఘటనా స్థలానికి రెండు కిలోమీటర్ల దూరంలో మృతదేహం లభించింది. బెళుగుప్ప మండలం దుద్దేకుంటకు చెందిన వెంకటస్వామిరెడ్డి, శ్రీదేవి రైతు దంపతుల పెద్దకుమారుడు కార్తీక్‌రెడ్డి. బెళుగుప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా పనిచేస్తుండేవారు. ఆయన భార్య శ్రావణి కర్నూలులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం హంద్రీనీవా బ్రిడ్జిపై నుంచి ఈత కొట్టేందుకు కాలువలోకి దూకారు. నీటి ప్రవాహ వేగానికి కొట్టుకుపోతూ.. కాపాడాలంటూ చేతులెత్తి అరిచారు. ఒడ్డున కూర్చుని ఉన్న బంధువుల సమాచారంతో బ్యాటరీలు వేసుకుని పోలీసులు గాలించారు. సోమవారం బ్రిడ్జికి రెండు కిలోమీటర్ల దూరంలో మృతదేహం లభ్యమైంది. భార్య శ్రావణి బంధువులు, తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.


కాలువ గట్టున విలపిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

పుట్టిన రోజునే ఆత్మహత్య

- అపార్ట్‌మెంట్ పైనుంచి దూకిన బీటెక్ విద్యార్థి
- అక్కడికక్కడే మృతి

అనంతపురం క్రైం, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన బీటెక్ విద్యార్థి చల్లా శ్రవణ్(18) పుట్టిన రోజునే ఆత్మహత్య చేసుకున్నాడు. తాము ఉంటున్న అపార్టుమెంట్‌లోని 5వ అంతస్తు నుంచీ దూకి ప్రాణం తీసుకున్నాడు. దీనిపై అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదుచేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బెలుగుప్ప మండలానికి చెందిన లక్ష్మీనరసింహులు కుటుంబం రాంనగర్‌లోని ఎస్ఎల్ఎన్ఎస్ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటోంది. ఇతడికి ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడైన చల్లా శ్రవణ్ బళ్లారిలోని బీఐటీఎం ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి ఏడాది చదువుతుండేవాడు. సోమవారం పుట్టినరోజు కావడంతో ఆదివారం ఇంటికి వచ్చాడు. ఆదివారం అర్ధరాత్రి దాటాక అపార్టుమెంట్ 5వ అంతస్తు నుంచీ దూకాడు. తల, ఇతర భాగాల్లో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అవమానభారంతో మహిళ..

బత్తలపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామానికి చెందిన ప్రమీల (45) సోమవారం అవమాన భారంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఉప్పర్లపల్లి గ్రామానికి చెందిన ముత్యాలు భార్య ప్రమీల అదే గ్రామానికి చెందిన వడ్డే నెట్టికంటికి ఐదేళ్ల కిందట రూ.20వేలు వడ్డీకి అప్పు ఇచ్చారు. రెండేళ్లుగా నెట్టికంటి వడ్డీ చెల్లించలేదు. ఈ విషయమై ఇద్దరి మధ్య వివాదం ఉంది. కాగా ప్రమీల తన పొలంలో పని చేయించుకున్నందుకు కూలీలకు ఇవ్వమని తన బంధువైన పెద్దక్కకు ఆదివారం కూలి డబ్బులు ఇచ్చింది. అయితే పెద్దక్క కూలీలకు డబ్బులు ఇవ్వలేదు. ఈ విషయం తెలుసుకున్న ప్రమీల పెద్దక్కను మందలించింది. ఇది విన్న నెట్టికంటి కోడలు హేమ తమనే తిడుతోందని భావించి తమ బంధువులైన ఆదిలక్ష్మి, సుంకన్నతో కలిసి ప్రమీలతో గొడవపడింది. ఈక్రమంలోనే సుంకన్న ప్రమీలపై చేయి చేసుకున్నాడు. అంతటితో ఆగని హేమ బత్తలపల్లిలో ఉన్న వాళ్ల అమ్మకు ఫోన్ చేసి, మరో ఇద్దరిని పిలిపించి మరోసారి ప్రమీలపై దాడి చేయించింది. దీన్ని అవమానంగా భావించిన ప్రమీల తీవ్రంగా కుంగిపోయింది. ఈ క్రమంలోనే సోమవారం తెల్లవారుజామున ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుంది. ఉరికి వేలాడుతున్న ప్రమీలను ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కలవారి సాయంతో కిందకు దించి చూడగా మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. సీఐ రెడ్డప్ప గ్రామానికి వెళ్లి మృతికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ విషయమై కొడుకు సంజీవరాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హేమ, ఆదిలక్ష్మి, సుక్కన్న, ఓసురప్ప, రామాంజనమ్మల కేసు నమోదు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి కార్యాలయ ఇన్‌చార్జు హరీష్‌బాబు, బీజేపీ నాయకులు వీరనారప్ప గ్రామానికి చేరుకొని ప్రమీల మృతదేహానికి నివాళులర్పించారు.

పెళ్లి కాలేదని యువకుడు..

శెట్టూరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): పెళ్లి కాలేదన్న మనస్తాపంతో మండలంలోని ఐదుకల్లు గ్రామానికి చెందిన కమ్మర నాగరాజు కుమారుడు కమ్మర హనుమంతరాయుడు (26) ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. ఎన్ని సంబంధాలు చూసినా వివాహం కుదరకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గ్రామ సమీపంలోని కరణం రాజశేఖర్ పొలం వద్ద చింతచెట్టుకు చీరతో ఉరేసుకుని, మరణించాడు. అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబికులు గ్రామంలో వెతికినా ప్రయోజనం లేదు. సోమవారం ఉదయం రాజశేఖర్ పొలం వైపు వెళ్లిన గ్రామస్థులు హనుమంతురాయుడు ఉరికి వేలాడుతుండడాన్ని చూసి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. అతడి తల్లి తిప్పమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపుర ంరూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 46టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

రమా.. నీవు లేకుండా ఎలా బతికేది..?

- భార్య మృతదేహంపై పడి రోదించిన భర్త
- ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన లారీ
- మహిళ మృతి.. ముగ్గురికి గాయాలు


రమాదేవి (ఫైల్)

గార్లదిన్నె/శింగనమల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 'రమా.. అప్పుడే నన్ను వదిలి పోతివా..? నాకు పని చేతకాదు. మన బిడ్డను ఎలా సాకాలి? ఎలా బతకాలి?' అంటూ భార్య మృతదేహంపై పడి దివ్యాంగుడైన భర్త రోదించిన తీరు కంటతడి పెట్టించింది. ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టడంతో ఓ మహిళ మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడిన సంఘటన సోమవారం తిమ్మంపేట వద్ద 44వ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు శింగనమలకు చెందిన దివ్యాంగుడైన చిన్న పోతన్న, రమాదేవి(35) దంపతులు శింగనమలలో కూలి పనులు చేసుకుని జీవించేవారు. గ్రామంలో పనులు లేక పోవడంతో కొన్ని నెలలు కిందట రమాదేవి పుట్టినిల్లు అయిన పామిడికి వలస వెళ్లారు. అయితే వారికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయడం, సదరం సర్టిఫికెట్ పనుల కోసం సోమవారం చిన్నపోతన్న, రమాదేవి తమ కుమారుడు సాంబశివను తీసుకుని తమ బంధువైన చంద్రశేఖర్‌తో కలిసి స్కూటీలో శింగనమలకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి పామిడికి స్కూటీలో బయల్దేరారు. తిమ్మంపేట వద్ద 44వ జాతీయ రహదారిపై వీరి స్కూటీని బెంగళూరు నుంచి ద్విచక్ర వాహనాల లోడుతో మధ్యప్రదేశ్‌కు వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీలో ప్రయాణిస్తున్న రమాదేవి అక్కడికక్కడే మృతి చెందగా చిన్న పోతన్న, కుమారుడు శివ, బంధువు శేఖర్ గాయపడ్డారు. రెప్పపాటులో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన భార్య మృతదేహంపై పడి చిన్న పోతన్న కన్నీరుమున్నీరుగా రోదించాడు. ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. క్షతగాత్రులను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ కల్లూరు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఉండగా పోలీసులు పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని వాహనాన్ని స్టేషన్‌కు తీసుకెళ్లారు.


భార్య మృతదేహంపై పడి ఏడుస్తున్న చిన్న పోతన్న

అంత్యక్రియలకు వెళుతుండగా..

- ఆటో బోల్తా, ఒకరి మృతి, కొందరికి గాయాలు


ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడిన ఆటోలోని సీటు

ఉరవకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బంధువుల అంత్యక్రియలకు వెళ్తూ, ఆటో బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. పామిడి మండలం, రామగిరి గ్రామానికి చెందిన తిరుపతయ్య(55) వజ్రకరూరు మండలం హోతూరులో తమ సమీప బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు వెళ్లేందుకు ఉరవకొండ నుంచి వెళ్తున్న ప్రయాణికుల ఆటో ఎక్కాడు. అయితే చిన్నహోతూరు సమీపంలోని హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ కాలువ వద్ద అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న తిరుపతయ్య, మారుతి, రామకృష్ణ, సావిత్రమ్మ, వసుంధర, మాలింగమ్మ, వన్నమ్మలతో పాటు మరికొంత మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఉరవకొండ ప్రభుత్వాసుపత్రి, గుంతకల్లులోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. తిరుపతయ్యకు తీవ్ర గాయాలు కాగా, అతన్ని గుంతకల్లులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెం దాడు. తీవ్రంగా గాయపడిన మారుతి, రామకృష్ణ, సావిత్రమ్మ హో తూరు గ్రామానికి చెందిన వారు కాగా, వసుంధర, మాలింగమ్మ, వ న్నమ్మలు కర్ణాటకలో కూలి పనులకు వలస వెళ్లి అంత్యక్రియల్లో పా ల్గొనేందుకు వచ్చి గాయపడ్డారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ నాగస్వామి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెంగళూరు రహదారిలో పాపిరెడ్డిపల్లి వద్ద సోమవారం కారు ఢీకొని శంకర్‌నాయక్ అలియాస్ గోప్యానాయక్ (74) సోమవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ షెక్షావలీ తెలిపారు. బూదిలి ప్రాంతానికి చెందిన శంకర్‌నాయక్ పుట్టపర్తి- బెంగళూరు రహదారిలో వడ్లకళ్లం చేస్తు, సోమవారం తెల్లవారుజామున చలిమంట వేసుకోవడానికి రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది. గోరంట్ల మండలంలోని పెరుమాళ్లపల్లికి చెందిన ఉమాశంకర్ బెంగళూరు నుంచి కారులో వస్తూ రోడ్డు దాటుతున్న శంకర్‌నాయక్‌ను ఢీకొట్టాడు. దీంతో శంకర్‌నాయక్ మృతి చెందాడు. మృతుడి కుమార్తె రేఖాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

- ఇదే రహదారిలో ఆదివారం రాత్రి ద్విచక్ర వాహన ప్రమాదం జరిగింది. చిలమత్తూరు మండలం బీదిరెడ్డిపల్లికి చెందిన తల్లీకుమారుడు లక్ష్మీదేవమ్మ, అమరనాథ్‌రెడ్డి ద్విచక్రవాహనంలో వెళ్తూ రోడ్డు పక్కన ఆపి ఉన్న ట్యాంకర్ లారీని ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీ ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం రూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ పరిధిలో సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో నిర్వహించిన బీఫార్మసీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. సోమవారం వర్సిటీలోని పరీక్షల విభాగంలో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య నాగప్రసాద్‌నాయుడు తదితరులు ఫలితాలను విడుదల చేశారు. బీఫార్మసీ మొదటి, రెండో సెమిస్టర్ల రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, ఫస్టియర్ రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ, మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఫలితాలను జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్‌లో విద్యార్థులు చూసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్ ఆచార్య శివకుమార్, ఆచార్య శంకర్‌శేఖర్‌రాజు, డా. శ్రీధర్, అంకారావు పాల్గొన్నారు.

మిట్స్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్‌కి డాక్టరేట్


డాక్టరేట్ పొందిన అధ్యాపకుడు మారుతీప్రసాద్

కురబలకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని అంగళ్లు సమీపంలో ఉన్న డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీకి చెందిన సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్, అధ్యాపకుడు మారుతీప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారని వీసీ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మారుతీప్రసాద్ తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీలో 'యాన్ ఇంటలిజెంట్ మల్టీమోడల్ సెక్యూరిటీ ఫ్రేమ్ వర్ ఎమర్జింగ్ అప్లికేషన్స్ యూజింగ్ ఐవోటీ' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను మిట్స్ యూనివర్శిటీ చాన్సలర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ప్రో చాన్సలర్ ద్వారకనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి తదితరులు అభినందించారు.

గుట్కా స్వాధీనం


సీజ్ చేసిన సరుకుతో అధికారులు

అనంతపురం క్రైం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): గుట్కాను అక్రమంగా బ్యాగుల్లో తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు సీజ్ చే శారు. సోమవారం ఏకంగా రూ.31.20 లక్షల విలువైన పాన్ మ సాలా, గుట్కా స్వాధీనం చేసుకున్నారు. రాబడిన సమాచారం మే రకు విజిలెన్స్ జీఎస్టీ అధికారులు రుద్రంపేట సమీపంలోని డీమార్ట్ వద్ద 44వ జాతీయ రహదారిపై తనిఖీలు చేశారు. వ్యాన్‌లో కర్ణాటక నుంచి తెలంగాణకు అక్రమంగా 120 గన్నీ బ్యాగుల్లో తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. లక్షలాది విలువైన ఈ సరుకును అధికారులు వాణిజ్య పన్నుల అధికారులకు స్వాధీనపరిచారు. తనిఖీల్లో సీఐ జమాల్‌బాషా, అధికారులు రాకేష్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు నమోదు చేయించండి

- డీడీ కుష్బూకొఠారి

అనంతపురం విద్య, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో చదివే ఎస్సీ ఉపకులాల విద్యార్థులకు ఉపకార వేతనాలకు సంబంధించి 2025-26 విద్యా సంవత్సరానికి ఫ్రెష్‌గా నమోదు చేయించాలని ఎస్సీ వెల్ఫేర్ ఇన్‌చార్జ్ డీడీ కుష్బూకొఠారి ప్రిన్సిపాళ్లను సోమవారం ఓప్రకటనలో కోరారు. ఇందు కోసం జ్ఞాన భూమి-వీ.2వెబ్‌పోర్టల్ కళాశాలల ప్రిన్సిపాళ్ల లాగిన్‌లో దరఖాస్తులు పొందుపరచినట్లు తెలిపారు. ఈ దరఖాస్తు నమోదు ప్రక్రియ సంబంధిత యూనివర్సిటీ అకడమిక్ క్యాలండర్ ఇయర్ ప్రారంభం నుంచి మూడు నెలలు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు అర్హులైన విద్యార్థులందరి రెన్యువల్, ఫ్రెష్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆమె సూచించారు.

కళ్యాణదుర్గం ఈ-స్టాంప్ అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించండి

- హైకోర్టులో పిల్

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గంలో ఈ-స్టాంప్ అక్రమాలపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. అనంతపురం వైసీపీ మాజీ ఎంపీ తలారి రంగయ్య ఈ పిల్ వేశారు. కళ్యాణదుర్గంలో బోయ యర్రప్ప, ఆయన భార్య భార్గవి ఈ-సేవా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అక్కడ నుండి తక్కువ విలువ చేసే ఈ-స్టాంపులను కొనుగోలు చేసి ఎక్కువ విలువగల స్టాంపులుగా మర్చి కళ్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధీనంలోని ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోట్ల రూపాయాల ఆర్థిక లావాదేవీలను నిర్వహించిందన్నారు. కంపెనీకి చెందిన ఆర్థిక లావాదేవీలు, లోన్ దస్త్రాల పై లోతైన విచారణ జరిపించాలని కోరారు.

బంగారం చైను లాక్కెళ్లిన దుండగులు

చిలమత్తూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మెరుగు పేరుతో ఓ మహిళ మెడలో బంగారం చైను లాక్కుపోయిన సంఘటన మండలంలోని మరవకొత్తపల్లిలో సోమవారం జరిగింది. బాధితురాలు సుశీలమ్మ తెలిపిన ప్రకారం ఇద్దరు వ్యక్తులు వచ్చి ఇంట్లో ఉన్న పాత వెండి, ఇత్తడి వస్తువులకు మెరుగుపెడతామని చెప్పారన్నారు. దీంతో తాను వారిని ఇంటి వద్దకు పిలిచి ఇంట్లో ఉన్న ఇత్తడి కలశం, ఇతర పూజ సామగ్రీ వస్తువులు ఇచ్చినట్లు తెలిపారు. మరికొన్ని వస్తువులను తీసుకురావడానికి ఇంట్లోకి వెళుతుండగా ఆ ఇద్దరి వ్యక్తుల్లో ఒక వ్యక్తి వెంబడించి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు చైనును లాగేసుకున్నాడన్నారు. ఇంటి బయట అప్పటికే ద్విచక్రవాహనంలో సిద్ధంగా ఉన్న వ్యక్తి దాన్ని ఎక్కి పారిపోయాడు. ఈ హఠాత్పరిణామం నుంచి తేరుకున్న ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చి దుండగుల కోసం వెంబడించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. అక్కడ ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ బాబు తెలిపారు.

రైల్వే ఉద్యోగులకు పురస్కారాలు

గుంతకల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రైలింజన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడగా అప్రమత్తమై అగ్ని ప్రమాదం జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించిన ఇద్దరు రైల్వే ఉద్యోగులకు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అభినందించి, ప్రశంసా పురస్కారాలను అందజేశారు. గుంతకల్లు నుంచి తిరుపతికి వెళ్తున్న రైలులోని ఇంజిన్‌లో పైన ఉండే హైటెన్షన్ కంపార్టుమెంట్‌లోని సేఫ్టీ ఎక్విప్‌మెంట్ అయిన కెపాసిటర్ డంపింగ్ ప్యానెల్ వేడెక్కిపోయి ప్రమాదకరంగా మారిన విషయాన్ని చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్ శబరినాథన్ గుర్తించారు. లోకో పైలెట్ అబ్దుల్ రవూఫ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన అప్రమత్తమై అగ్ని ప్రమాదం ఏర్పడకుండా రైలును జాగ్రత్తగా నడిపారు. సురక్షితంగా తిరుపతికి చేర్చగా అక్కడ రైలింజన్‌కు మరమ్మతులు చేశారు. రైలింజన్‌లో అగ్ని ప్రమాదం ఏర్పడకుండా అప్రమత్తంగా వ్యవహరించి, విధి నిర్వహణలో నిబద్ధతను చాటిన కారణంగా ఈ ఇద్దరు ఉద్యోగులను సోమవారం స్థానిక డీఆర్ఎం కార్యాలయానికి రప్పించారు. డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా.. చీఫ్ లోకో ఇన్స్‌పెక్టర్ శబరినాథన్‌కు, లోకోపైలెట్ అబ్దుల్ రవూఫ్‌కు ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్ పాల్గొన్నారు.


లోకో పైలెట్ అబ్దుల్ రవూఫ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

రేపు రైతుల ఖాతాల్లోకి సొమ్ము

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము విడుదల

అనంతపురం అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్మును ఈనెల 19వ తేదీన విడుదల చేయనున్నారు. సీఎం చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ సొమ్ము, కేంద్రంలో ప్రధాని మోదీ పీఎం కిసాన్ సొమ్మును విడుదల చేయనున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి అధికారికంగా సమాచారం అందింది. జిల్లాలోని 2,75,642 మంది రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము రూ.137.82 కోట్లు, పీఎం కిసాన్ సొమ్ము రూ.51.10 కోట్లు మొత్తం రూ.188.92 కోట్లు జమ చేయనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని 2,65,040 మంది రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము రూ.132.52 కోట్లు, పీఎం కిసాన్ నిధులు రూ.46.24 కోట్లు మొత్తం రూ.178.76 కోట్లు విడుదల చేయనున్నారు. ఏడాదిలో మూడు విడతలుగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము జమ చేయాలని నిర్ణయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.14 వేలు, కేంద్రం నుంచి రూ.6వేలు జమ చేయనున్నారు. ఈ ఏడాది ఆగస్టు 2వ తేదీన తొలి విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, కేంద్రం రూ.2వేలు చొప్పున జమ చేశాయి. ఈనెల 19వ తేదీన రెండో విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, కేంద్రం రూ.2వేలు జమ చేయనుంది. మిగిలిన సొమ్మును మూడో విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.4వేలు, కేంద్రం రూ.2వేలు జమ చేయనున్నాయి.

అనంతపురం బాలికల జట్టుకు ప్రథమ స్థానం


కబడ్డీ విజేతగా నిలిచిన అనంతపురం బాలికల జట్టు

వినుకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా వినుకొండ జూనియర్ కాలేజీ ఆవరణలో జరుగుతున్న కబడ్డీ పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్స్ పోటీల్లో బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్టు నెల్లూరు జిల్లా జట్టుపై విజయం సాధించి ప్రథమ స్థానం సాధించారు. నెల్లూరు బాలికల జట్టు ద్వితీయస్థానం సాధించింది. బాలుర విభాగంలో గుంటూరు బాలుర జట్టు కడప బాలుర జట్టుపై విజయం సాధించి గుంటూరు జట్టు ప్రథమస్థానం, కడప జట్టు ద్వితీయ స్థానం సాధించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కౌన్సిలర్ షకీలా దస్తగిరి తదితరులు పాల్గొని ఆటలను తిలకించి విజేతలకు బహుమతులు అందజేశారు.

సమస్యలను పరిష్కరించాలి

- లోకో రన్నింగ్ స్టాఫ్ డిమాండ్



ఆందోళన చేస్తున్న లోకో రన్నింగ్ స్టాఫ్

గుంతకల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైల్వే మజ్దూర్ యూనియన్ లోకో రన్నింగ్ స్టాఫ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సోమవారం ఉదయం రైల్వే స్టేషన్‌లోని క్రూ కంట్రోల్ లాబీ వద్దకు చేరుకున్న లోకో రన్నింగ్ స్టాఫ్ ఆందోళనకు దిగారు. యూనియన్ ఎల్ఆర్ఎస్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ఎం బాషా మాట్లాడుతూ.. రన్నింగ్ అలవెన్స్ పెంచాలనీ, టీఏ తరహాలో కిలోమీటర్ అలవెన్సుకు కూడా ఐటీ మినహాయింపు ఇవ్వాలనీ, రన్నింగ్ స్టాఫ్ ప్రతి ప్రమోషన్‌కు గ్రేడ్ పేను పెంచాలనీ, సైకో టెస్టులో ఫెయిలైన సిబ్బందికి పే ఎలిమెంట్ ఇవ్వకపోవడాన్ని ఉపసంహరించాలనీ, హెడ్ క్వార్టర్స్ బైపాసింగ్ విధానం వద్దనీ, 72 గంటల పని విధానాన్ని తొలగించాలనీ, డబుల్ కాల్ సిస్టంను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లోకో రన్నింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టీల నిర్వాహకురాలిపై దాడి

- ఇంటి ముందు ధర్నా


ధర్నా చేస్తున్న బాధితులు

గుంతకల్లుటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చిట్టీల డబ్బు ఇవ్వలేదంటూ సోమవారం సాయంత్రం ఓ మహిళ, ఆమె తండ్రి కళ్లలో కారం వేసి విచక్షణారహితంగా దాడి చేశారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ధర్మవరం గేట్ రోడ్డులో నివాసముంటున్న దిల్షాద్ బేగం ఫొటో స్టూడియో నడుపుతూ చిట్టీలు నిర్వహిస్తోంది. చిట్టీల డబ్బు ఇవ్వకుండా మోసం చేసి.. తమపైనే కేసులు పెడుతోందంటూ బాధితులు.. పర్వీన్, కౌసర్, షాకీరా, అరుణమ్మ తదితరులు దిల్షాద్ బేగం ఇంటిపై సోమవారం దాడి చేశారు. ఆమెను రోడ్డుపైకి ఈడ్చుకొచ్చి, కళ్లలో కారం కొట్టి, దాడి చేశారు. ఆమె ఇంటి ముందు రోడ్డుపై బైఠాయించి, తమకు న్యాయం చేయాలని కోరారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ధర్నా విరమించాలని నచ్చజెప్పారు. చిట్టీల డబ్బు ఇచ్చేవరకు ధర్నా విరమించేది లేదని వారు భీష్మించారు. గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. దిల్షాద్‌బేగం, ఆమె తండ్రిని పోలీసులు ఆటోలో స్టేషన్‌కు తరలించారు. బాధితులు కూడా వెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు.

టమోటా కిలో రూ.40

అనంతపురం రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో సోమవారం టామోటాలు కిలో గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.24తో, సరసరిగా రూ.30తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1950 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

న్యూస్ బాక్స్

నసనకోట శివాలయంలో ఎమ్మెల్యే పూజలు


కార్తీక దీపాలు వెలిగిస్తున్న పరిటాల సునీత

రామగిరి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక చివరి సోమవారం సందర్భంగా నసనకోటలోని పురాతన శివాలయంలో ప్రత్యేకపూజలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే పరిటాల సునీత స్వామిని దర్శించి పూజలు, అర్చనలు చేయించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. పలువురు భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రిపేరీపై శిక్షణ ప్రారంభం

గార్లదిన్నె, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కెనరా బ్యాంకు ఆవరణలో సోమవారం రూడ్ సెట్ సంస్థ వారు సెల్‌ఫోన్ రిపేరీపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. దీనిని బ్యాంకు మేనేజర్ వెంకటశివారెడ్డి, రూడ్ సెట్ సంస్థ విజయలక్ష్మి ప్రారంభించారు. అనంతరం బ్యాంకుమేనేజర్ మాట్లాడుతూ... రూడ్ సెట్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు సెల్‌ఫోన్ రిపేరీపై శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. శిక్షణ పూర్తి చేసుకుని షాపులు నిర్వహించుకునే యువకులకు కెనరా బ్యాంకు రుణాలు మంజూరు చేస్తుందని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఎం మల్లికార్జున, శిక్షకులు నాగేంద్ర, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూజారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

శింగనమల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శింగనమల దుర్గాంజనేయ స్వామి ఆలయ పూజారి సిరి రమణాచారి చేసిన బెదిరింపులపై ఆలయ నూతన కమిటీ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కమిటీ సభ్యులు ఆదినారాయణ సురేష్, మునేంద్రతో పాటు పలువురు గ్రామస్థులు జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్‌ను కలిసి మాట్లాడారు. దుర్గాంజనేయస్వామి ఆలయ పూజారి ఆలయ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, అలాగే ఆలయ నూతన కమిటీ ఏర్పాటు చేయడంతో ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని వాపోయారు. ఆలయంలో పూజలు కూడా సక్రమంగా చేయడం లేదని తెలిపారు. ఆలయం అభివృద్ధి జరగాలంటే పూజారి అందుబాటులో ఉండి పూజలు చేయాలన్నారు. ఇలాంటి ఆత్మహత్య బెదిరింపులు చేయకుండా చూడాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే దేవాదాయ అధికారులకు సమస్య పరిష్కారం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఎస్కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ శుభకు నివాళి


సంతాపం తెలుపుతున్న వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్ తదితరులు

అనంతపురం రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు ఎంసిఎస్ శుభ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో సోమవారం వర్సిటీలోని భువన విజయ ఆడిటోరియంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, రెక్టార్ వెంకటనాయుడు తదితరులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. తర్వాత వీసీ మాట్లాడుతూ.. శుభ ఎస్వీ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టాను పొందారన్నారు. ఆ తర్వాత ఎస్కేయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి ఆచార్యులుగా పదోన్నతి పొందారన్నారు. ఆమె పర్యవేక్షణలో చాలామంది ఎంఫిల్, పీహెచ్‌డీలు చేసి అవార్డులు తీసుకున్నారన్నారు. రసాయన శాస్త్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. రసాయన శాస్త్ర విభాగానికి విభాగాధిపతిగా, బోర్డ్ ఆఫ్ సిరీస్ ఛైర్మన్‌గా, యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా, రెక్టార్‌గా విశేషమైన సేవలను అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఇంజనీరింగ్, ఫార్మసీ ప్రిన్సిపాళ్లు, విశ్రాంత ఆచార్యులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కుంటిమద్ది విద్యార్థినులు


విద్యార్థినులతో హెచ్‌ఎం, పీడీ

రామగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటిమద్ది ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బాలకృష్ణారెడ్డి, పీడీ చిత్ర ఓబుళేశు తెలిపారు. పాఠశాలలో సోమవారం వారు మాట్లాడుతూ.. ఇటీవల అనంతపురంలోని ఆర్డీటీ క్రీడామైదానంలో జిల్లా స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-17సాఫ్ట్‌బాల్ పోటీలో తమ పాఠశాలకు చెందిన 9వతరగతి విద్యార్థిని జనని ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిపోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 20వతేదీన పశ్చిమగోదావరిజిల్లాలోని వీరవాసరంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. అలాగే బేస్‌బాల్ పోటీలలో 7వతరగతి విద్యార్థిని సింధు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఆమె డిసెంబరు మొదటి వారంలో నంద్యాల జిల్లా అహోబిళంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. అనంతరం ఆ విద్యార్థినిలను అభినందించారు. పాఠశాలకమిటీ ఛైర్మన్ జగన్నాథం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు పెరవలి విద్యార్థి


భార్గవ

శింగనమల: మండలంలోని పెరవలి జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి భార్గవ ఇటీవల అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 19నుంచి మదనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్ 14 బాలురు విభాగంలో ఈయన పాల్గొననున్నారు. విద్యార్థిని సోమవారం హెచ్‌ఎం హరినాథ్ పీడీ నరసింహారెడ్డి, పాఠశాల చెర్మన్ వరదరాజులు అభినందించారు.

ప్రైవేటీకరణతో పేదలకు అన్యాయం: వైసీపీ

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో పేదలకు అన్యాయం జరుగుతుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం జేఎన్‌టీయూ సమీపంలో అనంతపురం రూరల్ వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ రాష్ట్రంలోని 26 జిల్లాల్లోనూ మెడికల్ కళాశాలలుండాలన్న లక్ష్యంతో 17 నూతన ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చాక 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తున్నారన్నారు. దీనివల్ల పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అరటి రైతులను ఆదుకోవాలి

● టన్ను రూ.15 వేలతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలి ● రైతు సంఘం డిమాండ్ ● కలెక్టరేట్ ఎదుట ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అరటి పంటను టన్ను రూ.15వేలతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి... అరటిగెలలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శులు శివారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. జిల్లాలో సుమారు 15వేల హెక్టార్లలో అరటి పంటను సాగు చేశారన్నారు. అయితే గిట్టుబాటు ధర లేక కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి టన్ను రూ.2వేల నుంచి రూ.3వేలకు మించి కొనడం లేదన్నారు. ప్రస్తుతం 75శాతం పంట కోత దశలో ఉందన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేసి టన్ను రూ.15వేలకు కొనుకోలు చేయాలన్నారు. అలాగే ఇప్పటికే ఆ ధర కంటే తక్కువ అమ్మిన రైతులకు ఇన్సెంటివ్ రూపంలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హనుమం తు, చిన్న ఆంజనేయులు, రెడ్డిపల్లి శ్రీనివాసులు, సంజీవరెడ్డితో పాటు పలువురు అరటిరైతులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో 395 వినతులు

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజలు వివిధ సమస్యలకు పరిష్కారం కోరుతూ 395 వినతిపత్రాలను సమర్పించారు. వాటిని కలెక్టర్ ఆనంద్ స్వీకరించి పరిశీలించారు. అనంతరం డీఆర్వో మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునరెడ్డి, ఆనంద్, రమేష్‌రెడ్డి తదితరులతో మాట్లాడుతూ.. ప్రజలు వినతిపత్రాల ద్వారా తెలిపిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ పెండింగ్ పెట్టకూడదన్నారు. అలాగే గ్రీవెన్స్‌పై ఆడిట్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసు జారీ

అనంతపురం అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో గల ఎస్ఆర్ ఫర్టిలైజర్స్ దుకాణం యజమానికి కలెక్టర్ ఆనంద్‌కుమార్ సోమవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇటీవల ఆ ఫర్టిలైజర్స్ దుకాణంలో అనధికారికంగా నిల్వ చేసిన రూ.24 లక్షల విలువైన ఎరువులను వ్యవసాయాధికారులు సీజ్ చేసి, 6ఏ కేసు నమోదు చేశారు. 6ఏ కేసు నేపథ్యంలో అనధికారికంగా నిల్వ ఉంచిన రూ.24 లక్షల విలువైన ఎరువులను ఎందుకు ప్రభుత్వం పరం చేయకూడదో వివరణ ఇవ్వాలని దుకాణం యజమానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

మొక్కల పెంపకంతో కరువు నివారణ

● జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శనరావు


మొక్కలు చూపుతున్న వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య

అనంతపురం రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరువు నివారణ మొక్కల పెంపకంతోనే సాధ్యమవుతుందని జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూఏ అడ్మిస్ట్రేటివ్ బిల్డింగ్ ప్రాంగణంలో సోమవారం కార్తీక వన సమర్థన కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వీసీతో పాటు రిజిస్ట్రార్ కృష్ణయ్య హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వ పర్యావరణం, అడవులు, శాస్త్ర సాంకేతిక శాఖ ఆదేశాలకు అనుగుణంగా వర్సిటీలో కార్తీక వన సమర్థన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో దాదాపు వంద మొక్కలను నాటనున్నట్లు చెప్పారు. జిల్లా కరువును పూర్తిగా రూపుమాపలంటే వీలైనంత ఎక్కువగా మొక్కలు నాటి చెట్లుగా పెరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శారద, వర్సిటీ డైరెక్టర్లు కళాశాల ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్, హెచ్ఓడీలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలు

బుక్కరాయసముద్రం/శింగనమల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సహకార సొసైటీ కార్యాలయం వద్ద సోమవారం 72వ సహకార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ కేశన్న మాట్లాడుతూ సొసైటీలో రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలన్నారు. అనంతరం తిరిగి కొత్త రుణాలను పొందవచ్చన్నారు. సహకార సొసైటీ బలోపేతానికి అంద రూ సహకారం అందించాలని కోరారు. సొసైటీ వైస్ ఛైర్మన్ గంపన్న, ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ ఫణికుమార్, సూపర్‌వైజర్ భరత్, సీఈఓ ముస్తఫా, సిబ్బంది పాల్గొన్నారు. శింగనమల సహకార సొసైటీ కార్యాలయంలో సహకార వారోత్సవాలం సందర్భంగా ఛైర్మన్ గుర్రం లక్ష్మీనారాయణ సిబ్బంది, డైరెక్టర్లతో కలిసి సహకార జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులు ధాన్యంను సహకార సంఘానికి చెందిన గోడౌన్లలో నిల్వ చేసుకోవచ్చని తెలిపారు. అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప గ్రామోత్సవం

గార్లదిన్నె, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం రాత్రి అయప్పస్వామి గ్రామోత్సవం అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అంగరంగవైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించిన ట్రాక్టర్‌పై కొలువుదీర్చి గ్రామ పురవీధుల్లో మేళతాళాలు, భజనల మధ్యన ఊరేగింపు చేశారు. ప్రజలు అడుగడుగునా స్వామిని దర్శించి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు మునుపు మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నప్రసాద వితరణ చేశారు. గురుస్వాములు, అయ్యప్ప, శివుడి మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు శింగనమలకు ఎమ్మెల్యే రాక

శింగనమల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గల సమావేశం భవనంలో మంగళవారం మండల స్థాయి అధికారులకు, సచివాలయ సిబ్బందికి, సర్పంచులకు బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ చల్లా లలితమ్మ సోమవారం ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరు కానున్నట్లు చెప్పారు. కనుక అందరూ హాజరవ్వాలని కోరారు.

రక్షణ కల్పించండి: సంగా తేజస్విని


ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న తేజస్విని

అనంతపురం క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కక్షసాధింపు ధోరణిలో కొందరు దుండగులు తన కారుపై రెండుసార్లు దాడి చేశారని, తనపై కూడా దాడి చేసే ప్రమాదం ఉందని, కనుక రక్షణ కల్పించాలని తెలుగుయువత మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ప్రసాద్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆజాద్ నగర్‌లోని 6-451-3 ఇంటి ముందు పార్క్ చేసిన ఏపీ39ఆర్‌వై 9709 నంబర్ గల తన కారుపై గుర్తుతెలియని దుండగులు దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారన్నారు. గతంలో కూడా ఇదేవిధంగా కారు అద్దాలు పగలకొట్టారన్నారు. దాడి చేయడం ఇది రెండోసారి అన్నారు. రాబోయే రోజుల్లో తనపై కూడా దాడి చేసే ప్రమాదం ఉందన్నారు. రక్షణ కల్పించాలని, దాడి ఘటనపై విచారణ చేయాలని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో కవిసమ్మేళనం

చెన్నేకొత్తపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చెన్నేకొత్తపల్లిలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కవి మనోహర్ హాజరై కవితలు , కథలు ప్రజలపై చూపించే ప్రభావాన్ని వివరించారు. గ్రంథాలయ అధికారి జయరాం, పాఠకులు పాల్గొన్నారు.

ఏడీఓ అవినీతిపై చర్యలు తీసుకోవాలని వినతి

అనంతపురం విద్య, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీఓ అవినీతిపై చర్యలు తీసుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, ప్రధానకార్యదర్శి గోవింద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అమరావతిలో చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖారాణిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు.

కుష్ఠు పీడితుల గుర్తింపునకు ఇంటింటా సర్వే

అనంతపురం వైద్యం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఇంటింటా సర్వే ప్రారంభమైంది. ఇందులో భాగంగా లెప్రసి డిస్ట్రిక్ట్ ఆఫీసర్ డాక్టర్ జయలక్ష్మి తన సిబ్బందితో కలిసి నగరంలోని ఇందిరాగాంధీ నగర్‌లో ఇళ్లకు వెళ్లి సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 30వరకు ఈ సర్వే నిర్వహిస్తామన్నారు. కుష్ఠు లక్షణాలున్న వారిని గుర్తించి వైద్యసేవలందిస్తామన్నారు. డాక్టర్ రోహిత్ నాయుడు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన సహస్ర శంఖాభిషేక వేడుకలు

● ఘనంగా శతరుద్ర యాగం


పూర్ణాహుతి నిర్వహిస్తున్న అప్పాస్వామి బృందం

అనంతపురం టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శివకోటి ఆలయంలో ఈనెల 14వ తేదీ నుంచా నిర్వహిస్తున్న మహారుద్ర సహస్ర శంఖాభిషేక వేడుకలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ నేపథ్యంలో శివకోటి పీఠం వ్యవస్థాపకుడు అప్పాస్వామి నేతృత్వంలో ఆయన బృందం ఆలయ ఆవరణలో శతరుద్ర యాగాన్ని వేదమంత్రోచ్చారణల నడుమ కనుల పండువగా నిర్వహించడంతోపాటు శాస్త్రబద్ధంగా పూర్ణాహుతి గావించారు. అలాగే శివకామేశ్వరస్వామి మూలవిరాట్‌కు అప్పాస్వామి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. తర్వాత భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేసి వేడుకలను ముగించారు. కార్యక్రమంలో శివకోటి ఆలయ ట్రస్టు సభ్యులు అమర్నాథ్, నరసింహం, ఆలయ ప్రధానార్చకుడు సుబ్రహ్మణ్యం, అనిల్‌రెడ్డి, రమేష్, సుబ్బయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

హర హర మహాదేవ.. శంభో శంకర

● శివాలయాల్లో ఘనంగా కార్తీక చివరి సోమవార పూజలు ● పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు

అనంతపురం టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస చివరి సోమవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. వేకువజామునే అర్చకులు ఆలయాల్లోని మూలవిరాట్‌లకు రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం బిల్వార్చనలు, విశేష పూజలు జరిపారు. భక్తులు ఉదయం, సాయంత్రం సమయాల్లో పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అలాగే ఆలయాల ప్రాంగణాల్లో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక దీపాల వెలుగుల్లో ఆలయాలు కాంతులీనాయి. మిగతా ఆలయాల్లో కూడా కార్తీక పూజలు ఘనంగా జరిగాయి.


అరవిందనగర్ సర్వేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు


మొదటి రోడ్డు శివాలయంలో నందీశ్వరుడికి పూజలు


ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పోలీస్ పీజీఆర్ఎస్‌లో 83 వినతులు


ఫిర్యాదిదారులతో డీఎస్పీ శ్రీనివాసులు

అనంతపురం క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 83 వినతిపత్రాలు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు ఇతర సమస్యలపై న్యాయం చేయాలంటూ వినతులు అందించారు. డీఎస్పీ శ్రీనివాసులు వాటిని స్వీకరించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం వినతుల ద్వారా వచ్చిన సమస్యల్ని త్వరగా పరిష్కరించాలని పోలీసులను ఆదేశించారు.

లబ్ధిదారులకు రుణాలు చెల్లించాలి

● బ్యాంకర్లను కోరిన ఏఎంసీ కమిషనర్ బాలస్వామి


బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ కమిషనర్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందజేసి వారి అభ్యున్నతికి సహకరించాలని అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి బ్యాంకర్లను కోరారు. స్థానిక నగరపాలక సంస్థ న్యూకాన్ఫరెన్స్‌హాల్లో సోమవారం ఆయన మెప్మా స్పెషల్ టౌన్ లెవెల్ బ్యాంకర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా లబ్ధిదారులకు చేర్చి, పేదరికాన్ని నిర్మూలించడంలో బ్యాంకర్లది కీలక పాత్ర అని తెలిపారు. పీఎం స్వనిధి, స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు, వ్యక్తిగత రుణాలు, ముద్ర రుణాలు అందజేయాలన్నారు. వీధి వ్యాపారులకు ఆత్మనిర్భర్ భారత్ నిధి కింద రుణాలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రుణాలు ఈనెలాకరులోపు అందించాలని, పెండింగ్ దరఖాస్తుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఏఎంసీ డిప్యూటీ కమిషనర్ పావని, వివిధ బ్యాంకుల అధికారులు, మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

చెన్నేకొత్తపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 8వతరగతి చదువుతున్న పలువురు విద్యార్థులకు సోమవారం పుస్తకాలను పంపిణీచేశారు. జన విజ్ఞాన వేదిక తరపున మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు సంబంధించిన పుస్తకాలను సమకూర్చారు. దీంతో పాఠశాలలో ఎంఈఓ ప్రసూన్‌కుమార్‌నాయుడు, హెచ్‌ఎం ఓబుళమ్మ వాటిని విద్యార్థులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డిసెంబరు 7వతేదీన స్కాలర్‌షిప్‌నకు సంబంధించి పరీక్ష ఉండటంతో తర్ఫీదు పొందడానికి ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

మహిళ ఆత్మహత్య


చెన్నమ్మ మృతదేహం

నార్పల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బి. పప్పూరు గ్రామంలో మదమంచి చెన్నమ్మ(55)అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే .. గ్రామానికి చెందిన మదమంచి ఆదినారాయణ భార్య మదమంచి చెన్నమ్మ మూడేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతుండేది. పలుచోట్ల చికిత్సలు చేయించినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో మనోవేదనకు గురైన ఆమె సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

'దళిత సర్పంచ్‌నని అవమానిస్తున్నారు!'

బుక్కరాయసముద్రం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వ కార్యక్రమం జరిగినా... గ్రామ పంచాయతీలో ఏ అభివృద్ధి పని చేపట్టాలన్నా... అధికారులు తమ పట్ల వివక్షత చూపుతున్నారంటూ బుక్కరాయసముద్రం గ్రామ మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఆమె అధికారులు తన పట్ల చూపుతున్న వివక్షతపై ఆవేదన చేశారు. మండలకేంద్రంలో ఏ ప్రభుత్వ కార్యక్రమం జరిగినా తనకు ఆహ్వానం ఇవ్వడం లేదన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి అధికారులు తనిఖీకి వచ్చినా సమాచారం ఇవ్వరన్నారు. దళిత సర్పంచ్‌ను కావడంతోనే... మండల అధికారులు వివక్షత చూపుతున్నారన్నారు. అంతేకాకుండా గ్రామ పంచాయతీలో నేను చేసే అభివృద్ధి పనులకు తీర్మానం ఇవ్వడం లేదన్నారు. అలాగే చెత్త వేయడానికి డంప్ యార్డు నిర్మాణం చేపడితే.. పంచాయతీరాజ్ ఇంజనీర్ అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అన్ని చోట్ల తనకు అవమానం కలిగేలా చేస్తున్నారని వాపోయారు.ఇలా అయితే.. త్వరలోనే అధికారులపై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని ఆమె హెచ్చరించారు.

వైసీపీ యువజన విభాగం ఆందోళన

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): హిందూపురంలోని వైసీపీ కార్యాలయంపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం నగరంలోని జడ్పీ కార్యాలయం ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద వైసీపీ యువజన విభాగం నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దాడులు, అక్రమ కేసులకు భయపడమని అన్నారు. హిందూపురంలో అధికారం పిచ్చోడి చేతికి రాయి ఇచ్చినట్లుగా ఉందన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ నియోజకవర్గానికి గెస్ట్‌లా వచ్చి వెళ్తున్నారని విమర్శించారు. యువజన విభాగం నగరాధ్యక్షుడు శ్రీనివాస్‌దత్త, నాయకులు వినీత్, ఉదయ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం

● పెన్నహోబిలంలో అధిక ధరలకు టెంకాయల విక్రయం
● చోద్యం చూస్తున్న ఆలయ అధికారులు

ఉరవకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో టెంకాయలు రూ.40లకు విక్రయించాల్సి ఉంది. ఆ మేరకు నిర్వహించిన వేలంపాటలో దక్కించుకున్న కాంట్రాక్టర్.. ప్రస్తుతం ఒక్కో టెంకాయని రూ.50కు అమ్ముతున్నాడు. అది కూడా క్వాలిటీ లేని వాటిని. ఆ కాంట్రాక్టర్ హోల్‌సేల్‌లో రూ.15-రూ.20 ఉన్న టెంకాయలు తెచ్చి.. ఆలయ ప్రాంగణంలో రూ.50కి విక్రయిస్తున్నాడు. ఇలా ఆలయ ప్రాంగణంలోనే కాంట్రాక్టర్ నిబంధనలు ఉల్లఘిస్తున్నా.. ఆలయ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

● కొరవడిన పర్యవేక్షణ

ఆలయ కార్యనిర్వహణ అధికారి దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో జిల్లా దేవదాయ శాఖ అధికారిని ఇన్‌చార్జీ ఈఓగా నియమించారు. జిల్లా దేవాదాయశాఖ అధికారి అనంతపురానికే పరిమితమయ్యారు. కేవలం ఒక జూనియర్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. ఆయన కూడా ఉద్యోగోన్నతిపై తిరుగుతున్నారు. దీంతో పర్యవేక్షించే వారే లేరు. దీనిపై ఇన్‌చార్జ్ ఈఓ తిరుమల రెడ్డిని వివరణ కోరగా.. టెంకాయలను అధిక ధరలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. గతంలోనూ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. మరళా ఇలాగే కొనసాగితే లీజు రద్దు చేస్తామన్నారు.


విక్రయానికి ఉంచిన చిన్న సైజు టెంకాయలు




కూడేరు సంగమేశ్వరస్వామి, కణేకల్లు శ్రీచిక్కణ్ణేశ్వర, యాడికి మండలం కోనరామలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక వెలుగులు ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు వేకువజామున, రాత్రివేళ ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపాలు వెలిగించి.. పరమేశ్వరుడికి హారతులు పట్టారు.

వైభవంగా కనకదాస జయంతి


నేమకల్లులో 108 కలశాలతో బాలికల ఊరేగింపు

బొమ్మనహాళ్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లులో సోమవారం కనకదాస జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రధాన వీధుల్లో కనకదాస చిత్రపటాన్ని ఊరేగించారు. 108 మంది బాలికలు కలశాలతో ఇందులో పాల్గొన్నారు. ఇందులో టీడీపీ నాయకులు గాలి బసప్ప, బెళ్లి హనుమంతరెడ్డి, గాదిలింగ, రమేష్, కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వీరశైవులను ఓబీసీలోకి చేర్చండి

కణేకల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వీరశైవులను ఓబీసీ జాబితాలో చేర్చేలా కృషి చేయాలని రాష్ట్ర వీరశైవ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ స్వప్నను టీడీపీ నాయకులు వేలూరు మరియప్ప కోరారు. సోమవారం కణేకల్లుకు వచ్చిన ఆమెను వారు సన్మానించారు. ఇందులో టీడీపీ నాయకులు శరభనగౌడ్, నాగరాజు పాల్గొన్నారు.


స్వప్నను సన్మానిస్తున్న నాయకులు

కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలి



రిలేదీక్ష చేస్తున్న కార్మికులు

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తమతో ఖాళీ బాండ్లపై సంతకాలు తీసుకున్న కాంట్రాక్టర్లు వెంకటరావు, గౌతమ్, కిరణ్‌పై క్రిమినల్ కేసులు పెట్టాలని శ్రీరామ్‌రెడ్డి తాగునీటి పథకం కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలేదీక్షలు చేపట్టారు. వేతనం రూ. 18 వేలు ఇవ్వకుండా.. దౌర్జన్యంగా రూ. 11 వేలే ఇస్తున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు

గుంతకల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి సోమవారం నుంచి స్పాట్ అడ్మిషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మయ్య తెలిపారు. బీఏ ఎకనామిక్స్‌లో 15, బీఏ ఇంగ్లీషులో 18, బీకాం జనరల్‌లో 45, బీకాం సీఏలో 12, బీఎఫ్ఎస్ఐలో 34, బీఎస్సీ బాటనీలో 15, జువాలజీలో 266, ఫిజిక్స్‌లో 20, కెమెస్ట్రీలో 3, కంప్యూటర్ సైన్స్‌లో 18, మేథమేటిక్స్‌లో 22 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. కళాశాలలో చేరదలచిన విద్యార్థులు ఈ నెల 20వ తేదీ లోపు రావాలని, మొదట వచ్చినవారికి ప్రాధాన్యత ఉంటుందని, పూర్తి వివరాలకు అడ్మిషన్స్ కో-ఆర్డినేటర్ గానీ 6302267114 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.

కుంటను తలపిస్తున్న రహదారి


రోడ్డుపై నిల్వ ఉన్న నీరు

వజ్రకరూరు (ఉరవకొండ), నవంబరు17(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని కొనకొండ్లలోని హోతూరుకు వెళ్లే రహదారిపై భారీగా నీరు నిల్వ ఉంటూ.. కుంటను తలపిస్తోంది. ఎగువ భాగాన నాగలచెరువు తూము ఎత్తడంతో చెరువు నీరు అంతా వంక, కాలువల ద్వారా ఇలా రోడ్డు పైకి చేరుతోంది. దీంతో ఈ మార్గం ద్వారా వెళ్లే చాయాపురం, పొట్టిపాడు, హోతూరు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు.

దెబ్బతిన్న రోడ్డుకు ప్యాచ్‌వర్క్‌లు



ప్యాచ్‌వర్క్ పూర్తయిన రోడ్డు

పుట్లూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాండ్లపాడు గ్రామశివారులో తాడిపత్రి-యల్లనూరు రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. దీనిపై ఈనెల 8న ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఆర్ అండ్‌బీ అధికారులు రోడ్డుపై ఏర్పడ్డ గుంతలకు ప్యాచ్‌వర్కులు చేసి.. వాటిని పూడ్చివేశారు.

హెచ్చెల్సీ పక్కనే తవ్వకాలు

కర్ణాటకలో దుశ్చర్య


సరిహద్దులో హెచ్చెల్సీ పక్కనే చేపట్టిన తవ్వకాలు

బొమ్మనహాళ్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల సరిహద్దులోని తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) పక్కనే కర్ణాటక పరిధిలో మట్టి తవ్వకాలు చేపడుతుండడం మండల రైతుల్లో ఆందోళన రేపుతోంది. కాలువ అనంత భాగంలో ఉండగా, తవ్వకం మాత్రం అవతల రాష్ట్రంలో చేపడుతున్నారు. యంత్రాలతో కాలువకు కొన్ని అడుగుల దూరంలో తవ్వుతున్నారు. తద్వారా కాలువ బలహీనపడే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. అయినా.. హెచ్చెల్సీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కర్ణాటక అధికారులు కాలువ పక్కనే తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే తవ్వకాలను నిలిపివేసి కాలువ పటిష్టతకు చర్యలు తీసుకోకపోతే పెద్ద ప్రమాదం తప్పదని రైతులు అంటున్నారు.

మట్టి తవ్వకుండా చర్యలు తీసుకుంటాం

సరిహద్దులో ఎగువ కాలువ పక్కన మట్టి తవ్వకాలు చేపడుతున్నట్లు నా దృష్టికి వచ్చింది. ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లి మట్టితవ్వకాలను నిలుపుదల చేయించాం. కాలువ పక్కన తవ్వకాలు చేపట్టకుండా చర్యలు తీసుకుంటాం.

-మునివేలు, తహసీల్దార్, బొమ్మనహాళ్

కర్ణాటక అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఎగువ కాలువ బొమ్మనహాళ్ సెక్షన్‌లోకి వస్తుంది. మట్టి తవ్వకాలు మాత్రం కర్ణాటక పరిధిలో చేస్తున్నారు. అక్కడి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-అల్తాఫ్, హెచ్చెల్సీ ఏఈఈ, బొమ్మనహాళ్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కూడేరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో మరుట్ల 2వ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి శరవన్‌కుమార్ ప్రతిభ చాటారు. ఈ నెల 22న తూర్పు గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు పీఈటీ ప్రభాకర్ తెలిపారు.


శరవన్‌కుమార్

చర్యలు తీసుకోవాలి

రాయదుర్గంరూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ ట్రావెల్స్, స్కూల్, కాలేజీల బస్సులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు క్రాంతీష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, త్వరలోనే దీనిపై ఆర్టీఓ కార్యాలయాల ఎదుట నిరసన చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో తాలూకా కోశాధికారి నాగయ్య, శంకర్, గంగాధర్, సురేష్, తేజ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులతో నేడు సమావేశం

గుంతకల్లుటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఎస్‌జేపీ ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థులు, ప్రముఖులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తామని, పూర్వవిద్యార్థులు తప్పక హాజరుకావాలని కోరారు.

న్యూస్ బాక్స్

ఆసుపత్రిలో సమస్యలపై ఆరా


వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక వందపడకల ఆసుపత్రిని సోమవారం తనిఖీ చేసిన ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి.. అక్కడి సమస్యలపై ఆరా తీశారు. ఈసీజీ, మోనిటర్ యూనిట్, దాదాపు ఏడు బెడ్లను అల్ట్రాటెక్ వారు, ఎక్స్‌రే ప్లాంట్‌ను అర్జాస్ స్టీల్‌ప్లాంట్ వారు విరాళంగా అందజేశారు. వాటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆసుపత్రిలో బాత్రూం, మూత్రశాలలు లేక చాలామంది రోగులు ఇబ్బందులు పడుతున్నారని, వారు ఇబ్బందులు పడకుండా వాటిని నిర్మిస్తామని అన్నారు. గతంలో బిల్డింగ్ కాంట్రాక్టర్ పూర్తిగా పనులు చేయకుండా వదిలేశారని, ఇప్పటి వరకు దాదాపు రూ. కోటి వెచ్చించినా పూర్తికాలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

మాన్యం ఆక్రమణపై ఫిర్యాదు

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో దేవుని మాన్యం ఆక్రమించారని బొమ్మనహాల్ మండలం సిద్దరాంపురం గ్రామానికి చెందిన గంగాధర్, అశోక్‌కుమార్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వేనెంబరు 130లో 1.66ఎకరాలు గ్రామ దేవత పేరుతో ఉందని, కానీ ఆ భూమిని తలారి వన్నూరుస్వామి కబ్జా చేశాడని, ఆ భూమిని సాగు చేసుకుంటున్నాడని ఆరోపించారు. ఆన్‌లైన్‌లో సైతం దేవస్థానం పేరుతోనే ఆ భూమి ఉందని, కానీ అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ విషయంపై దేవదాయశాఖ అధికారులు రెవెన్యూ అధికారులకు లేఖ రాశారన్నారు. కానీ తహసీల్దార్ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. న్యాయం చేయాలని కోరారు.

● కూడేరులో కళాశాల ఏర్పాటు చేయాలి

కూడేరు: కూడేరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి తగ్గుపర్తి చందు డిమాండ్ చేశారు. సోమవారం అనంతపురంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు.

● మార్కెట్ ఆదాయం స్వాహా

యాడికి : యాడికిలో నిర్వహించే గొర్రెల సంత ఆదాయం యాడికి గ్రామ పంచాయతీకి చెందేలా చర్యలు చేపట్టాలని పలువురు సీపీఐ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలోని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. యాడికిలో గొర్రెల సంత ద్వారా ప్రతినెలా లక్షరూపాయలకు పైగా ఆదాయం వస్తున్నదని, ఆ ఆదాయాన్ని ప్రైవేట్ వ్యక్తులు దోచుకుతింటున్నారని తెలిపారు. దీనిపై స్థానిక అధికారులకు ఫిర్యాదుచేసినా ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి వడ్డె రాముడు, నాయకులు గరిడి శివన్న, బండారు రాఘవ ఉన్నారు.

గ్రామం మధ్యలో మురుగుకుంట

దుర్వాసనతో కడదరకుంట వాసుల పాట్లు



కూడేరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడదరకుంట గ్రామ మధ్యలో మురుగుకుంట ఉంది. అందులో ఉన్న నీరు సంవత్సరాలుగా నిల్వ ఉండటంతో పాచిపట్టి తీవ్ర దుర్వాసన వస్తోంది. దోమలకు నిలయంగా మారింది. దీంతో గ్రామస్థులు రోగాల బారిన పడుతున్నారు. ఈ కుంట సమీపంలోనే అంగన్‌వాడీ కేంద్రం ఉంది. అధికారులు స్పందించి.. ఆ కుంటను పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

పంటల నమోదు జాబితా ప్రదర్శన

యల్లనూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్-2025లో పంటలు సాగు నమోదు వివరాల జాబితాను ఆయా రైతుసేవా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచామని వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ జాబితాను రైతులు పరిశీలించుకొని నమోదు ప్రక్రియలో ఏమైనా పొరపాట్లు ఉంటే వెంటనే తమకు తెలియజేయాలన్నారు.

నేడు కార్తీక వనభోజనం

పామిడి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పెన్నానది ఒడ్డున ఉన్న సింగరప్పకొండ ఆలయం వద్ద మంగళవారం భావసార క్షత్రియుల కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు రంగసుబేపిర్కా భావసార క్షత్రియ సమాజ్ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక విఠోబస్వామి దేవాలయం నుంచి నారాయణస్వామి వీధి(సంతమార్కెట్)లోని అశ్వర్థ నారాయణస్వామి దేవాలయం వరకూ భజన కార్యక్రమం ఉంటుందని, మధ్యాహ్నం కొండపై ఆలయం వద్ద వనభోజనాలు ఉంటాయని తెలిపారు.

ఆధార్ క్యాంపులు నిర్వహించాలి

కుందుర్పి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో దశల వారీగా ఆధార్ క్యాంపులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయభాస్కర్ ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ కోసం ఈ నెల 15 నుంచి 26 వరకు కొన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మాత్రమే ఈ క్యాంపులు నిర్వహిస్తున్నారని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

రేపు రక్తదానశిబిరం

యాడికి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో బుధవారం యాడికిలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగిరెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో సేకరించిన రక్తాన్ని బత్తలపల్లి ఆర్డీటీ హాస్పిటల్‌కు అందజేస్తామన్నారు.

నేటి నుంచి శిక్షణ

శెట్టూరు/బొమ్మనహాళ్/పుట్లూరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): శెట్టూరు, బొమ్మనహాళ్, పుట్లూరులోని మండల పరిషత్ కార్యాలయాల్లో మంగళ, బుధవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయా ఎంపీడీఓలు జిలానీ బాషా, విజయభాస్కర్, అలివేలమ్మ తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రతపై ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

దివ్యాంగులకు చేయూత

తాడిపత్రి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్షనర్ల సంఘం కార్యాలయంలో సోమవారం 20 మంది దివ్యాంగులకు రూ. ఐదు వేల విలువైన నిత్యావసర సరుకులను అందజేసినట్లు అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి తెలిపారు. సంఘం తరపున చేపట్టే సేవా కార్యక్రమాలకు చల్లవారిపల్లికు చెందిన రిటైర్డ్ ఉద్యోగి నారాయణరావు రూ.18 వేలు సాయం చేస్తానని ప్రకటించారన్నారు.

మహిళ ఆత్మహత్య

గుత్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత సీపీఐ కాలనీలో నివాసముంటున్న ప్రియ (22) అనే వివాహిత సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్న ఆమె.. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఈ అఘాయిత్యానికి పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రియ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆత్మహత్యాయత్నాం

గుత్తిరూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి గ్రామానికి చెందిన విజయలక్ష్మి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. అపస్మారకస్థితిలో పడి ఉన్న ఆమెను బంధువులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గ్యాస్ ప్రమాదం.. ఎనిమిది మందికి గాయాలు

గుంతకల్లుటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక రాయల్ సర్కిల్ నివాసముంటున్న వడ్డె రామాంజినేయులు ఇంట్లో సోమవారం గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది గాయపడ్డారు. రామాంజినేయులు కుమారుడు అశోక్ వివాహం ఆదివారం జరిగింది. సోమవారం తిరుగు పెళ్లి ఉంది. ఉదయం ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ అయిపోయింది. రామాంజినేయులు సోదరుడు గంగాధర్ గ్యాస్ సిలిండర్ మారుస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటల చెలరేగాయి. సిలిండర్ వద్ద ఉన్న గంగాధర్ చాముండేశ్వరి, ఉమాదేవి, రాధ, రాజీ, సురేఖ, ఇద్దరు చిన్న పిల్లలు దీక్షశ్రీ, అకాష్ గాయపడ్డారు. వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

తాడిపత్రి, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రాయచోటికి చెందిన అఖిల స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద సోమవారం కనిపించకుండా పోయింది. నాలుగు సంవత్సరాల క్రితం పుట్లూరు మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డితో ఆమెకు వివాహమైంది. ప్రస్తుతం ఈమె ఏడునెలల గర్భిణీ. రెండు రోజుల క్రితం అఖిల తల్లి విజయలక్ష్మి ఆమెను పుట్టింటికి తీసుకువెళ్లాలని తక్కళ్లపల్లికి వచ్చింది. అఖిల డబ్బులు తీసుకుందని ఆమె అత్త, మామ ఆమెతో ఆదివారం రాత్రి వాదనకు దిగారు. సోమవారం ఉదయం రాయచోటికి వెళ్లడానికి అఖిల, విజయలక్ష్మి తాడిపత్రి బస్టాండ్‌కు వచ్చారు. బస్సు కోసం వేచి ఉన్న సమయంలో టిఫెన్ తిని వస్తానని బయటకు వెళ్లిన అఖిల తిరిగి రాలేదు. ఆమె తల్లి పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

రేషన్ బియ్యం సీజ్

తాడిపత్రి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె క్రాస్ సమీపంలో మూతపడిన పరిశ్రమలో నిల్వ ఉంచిన 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐలు గోపాలుడు, నరేంద్రభూపతి సోమవారం సీజ్ చేశారు. వాటిని సివిల్‌సప్లై అధికారులకు అప్పగించారు. ఇందులో రెవెన్యూ సివిల్‌సప్లై అధికారి మల్లేష్‌ప్రసాద్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

బెళుగుప్ప, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బీసీ కాలనీలో ఈనెల 14న శాంతి దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో పరారీలో ఉన్న నిందితులు జయసింహ, తిప్పేస్వామిని ట్రైనీ ఎస్ఐ మహేష్, సిబ్బందితో గుండ్లపల్లి క్రాస్ వద్ద సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ మహానంది తెలిపారు. వారిని కోర్టుకు హాజరుపరిచి.. రిమాండ్‌కు తరలించామన్నారు.